ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

బుధవారం 31 జూలై 2024

1 నుంచి డాక్‌యార్డు వంతెన మూసివేత - వార్త I పేజీలో

- కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు
- ట్రాఫిక్ నియంత్రణకు 60 మంది ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను నియమిస్తామన్న పోర్టు అధికారులు
- ఎస్‌బీసీ వంతెన మీదుగా రాకపోకలకు నో

భీమిలి బీచ్‌రోడ్డులో అదుపుతప్పిన బైక్

- ఇంజనీరింగ్ విద్యార్థి మృతి
- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు

- వార్త I పేజీలో

రసవత్తరంగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక

కూటమి, వైసీపీ మధ్య పోటాపోటీ

- పది స్థానాలకు ఇరుపక్షాల నుంచి పదేసి మంది నామినేషన్
- జీవీఎంసీలో గల 97 మంది కార్పొరేటర్లకు ఓటు హక్కు
- గెలుపునకు 49 ఓట్లు అవసరం
- ప్రస్తుతం వైసీపీకి 48, కూటమికి 47 మంది మద్దతు
- అవకాశం దక్కని కొందరిలో అసంతృప్తి
- ఇరువర్గాల్లోనూ క్రాస్ ఓటింగ్ గుబులు
- కూటమి వైపు మరికొందరు వైసీపీ కార్పొరేటర్ల చూపు
- వచ్చేనెల ఏడున పోలింగ్



స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్లు వేస్తున్న కూటమి కార్పొరేటర్లు(ఫైల్)



స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్లు వేస్తున్న వైసీపీ కార్పొరేటర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ముగిసింది. వచ్చే నెల ఏడున పోలింగ్ జరగనున్నది. పది స్థానాలు ఉండగా కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది కార్పొరేటర్లు పోటీలో నిలిచారు. గెలుపునకు 49 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం కాగా...ఇరుపక్షాలు ప్రస్తుతం సమాన బలంతో ఉన్నాయి. అయితే ఇరుపక్షాల్లోని కార్పొరేటర్లలో కొందరు అసంతృప్తితో రగిలిపోతుండడంతో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం లేకపోలేదనే ప్రచారం జరుగుతోంది.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక రసవత్తరంగా మారింది. కమిటీలో పది స్థానాలకు వచ్చే నెల ఏడున పోలింగ్ జరపాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. దీని కోసం మంగళవారంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. 97 మంది కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ సభ్యులను బ్యాలెట్ ద్వారా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

2021లో జీవీఎంసీకి జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి 58 మంది, టీడీపీ నుంచి 30 మంది, జనసేన తరఫున ముగ్గురు, సీపీఐ, సీపీఎం, బీజేపీ నుంచి ఒక్కొక్కరు కార్పొరేటర్లుగా గెలిచారు. నాలుగు వార్డుల్లో స్వతంత్రులు విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాల్లో కొంతమంది కార్పొరేటర్లు పార్టీలు మారడంతో కౌన్సిల్‌లో పార్టీల బలాబలాలు మారుతూ వచ్చాయి. 21వ వార్డు కార్పొరేటర్‌గా వైసీపీ తరఫున విజయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చింది. దీంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం 97 మంది మాత్రమే ఉన్నారు. ఇటీవల వైసీపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వీరిలో ఏడుగురు టీడీపీలో చేరిపోగా, ఐదుగురు జనసేనకు మద్దతు ప్రకటించారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 48కి తగ్గిపోగా, కూటమి బలం 47కి పెరిగింది. సీపీఐ, సీపీఎం నుంచి ఒక్కొక్క కార్పొరేటర్ ఉన్నప్పటికీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వారి వైఖరి ఏమిటనేది ఇంకా ప్రకటించలేదు. స్టాండింగ్ కమిటీలో ఒక్కో సభ్యుడికి కనీసం 49 ఓట్లు అవసరం కాగా ప్రస్తుతం వైసీపీకి 48 మంది, కూటమికి 47 మంది సభ్యుల మద్దతు ఉండడంతో ఎన్నిక ఆసక్తిగా మారింది. వైసీపీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లు ఆ పార్టీని ... మిగతా 6వ పేజీలో

స్టాండింగ్ కమిటీకి 20 నామినేషన్లు

టీడీపీ నుంచి 10 మంది, వైసీపీ నుంచి 10 మంది పోటీ

నేడు నామినేషన్లు పరిశీలన

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి 20 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఆఖరు రోజైన మంగళవారం ఐదుగురు నామినేషన్లు దాఖలైనట్టు వివరించారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో టీడీపీకి చెందిన కార్పొరేటర్లు పది మంది, వైసీపీ నుంచి పది మంది ఉన్నారన్నారు. కూటమి తరఫున టీడీపీకి చెందిన నొల్లి నూకరత్న (19వ వార్డు), గల్లా పోలిపల్లి (63వ వార్డు), శరగడం రాజశేఖర్ (56వ వార్డు), బొమ్మిడి రమణ (90వ వార్డు), గొలగాని వీరారావు (27వ వార్డు), పిసిని వరహానరసింహం (98వ వార్డు), పులి లక్ష్మీబాయి (75వ వార్డు), బల్ల శ్రీనివాసరావు (94వ వార్డు), పిళ్లా మంగమ్మ (7వ వార్డు)తోపాటు ఇండిపెండెంట్‌గా గెలిచి ఇటీవల టీడీపీలో చేరిన విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) నామినేషన్లు దాఖలు చేశారన్నారు. వైసీపీ నుంచి అక్కరమాని రోహిణి (12వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), బిపిన్‌కుమార్‌జైన్ (31వ వార్డు), ముర్రువాణి (57వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు), నక్కెల్ల లక్ష్మి (20వ వార్డు), తోట పద్మావతి (34వ వార్డు), కరజాడ వెంకటనాగ శశికళ (55వ వార్డు), పల్లా అప్పలకొండ (28వ వార్డు) నామినేషన్ వేశారన్నారు. వీరి నామినేషన్లను బుధవారం పరిశీలిస్తామని కమిషనర్ తెలిపారు. వచ్చే నెల ఏడో తేదీన ఎన్నిక జరగనున్నది.

ఎమ్మెల్సీ ఎన్నికకు రంగం సిద్ధం

షెడ్యూల్ విడుదల



- వచ్చే నెల 6న నోటిఫికేషన్
- 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ
- 30న పోలింగ్
- సెప్టెంబరు 3న ఓట్ల లెక్కింపు
- విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో అమలులోకి ఎన్నికల కోడ్
- బదిలీలు, శంకుస్థాపనలకు బ్రేక్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ పదవి (స్థానిక సంస్థల కోటా)కి ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మెజారిటీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో 2021 డిసెంబరులో స్థానిక సంస్థల కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కాగా వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి ఎన్నికయ్యారు. అయితే వంశీకృష్ణ గత ఏడాది నవంబరులో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పార్టీ ఫిరాయింపు పేరుతో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా శాసన మండలి ఛైర్మన్ ప్రకటించారు. ఆ స్థానంలో మరొకరిని ఎంపిక చేయాల్సి ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ సభ్యులు కలిసి ఎమ్మెల్సీని ఎన్నుకోవలసి ఉంది. దీనికి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు.

ఆగస్టు 6వ తేదీన ఎన్నిక నోటిఫికేషన్ జారీచేస్తారు. ఆగస్టు 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ ఉపసంహరణకు 16వ తేదీ వరకు గడువు ఉంటుంది. అదే నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సెప్టెంబరు 3వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. సెప్టెంబరు 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఎన్నికల అధికారి అయిన విశాఖపట్నం జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఎన్నికలలో ఎవరు గెలిచినా వారి పదవీ కాలం 2027 డిసెంబరు ఒకటో తేదీ వరకు ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ మంగళవారం విడుదల చేసినందున ఎన్నికల కోడ్ మూడు జిల్లాలలోను అమలులో ఉంటుందని కలెక్టర్ స్పష్టంచేశారు. కోడ్ ముగిసేంత వరకూ ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు ఉండవు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ఉండవు.

వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఏయూ

ఆ దిశగా దృష్టి పెట్టాలని అధికారులకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆదేశం

- ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మోడల్‌గా తయారుచేస్తే దాన్ని అన్ని విశ్వవిద్యాయాల్లో అమలు చేస్తాం
- నైపుణ్యాల పెంపును విద్యలో అంతర్భాగం చేయాలి
- ఇండస్ట్రీ ల్యాబ్స్ స్థాపించాలి
- విద్యా సంస్థల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు



ఏయూను సందర్శించిన రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): **ఏయూను వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ సూచించారు. మంగళవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆయన పాలక మండలి సమావేశ మందిరంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావుతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్య శిక్షణను విద్యలో అంతర్భాగం చేయాలని సూచించారు. వర్సిటీలోని ప్రతి విభాగంలో ఇండస్ట్రీ ల్యాబ్‌ను ఏర్పాటుచేయాలని ఆదేశించారు.**

నైపుణ్యాభివృద్ధి రంగంలో పనిచేస్తున్న విభిన్న శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రవేశాల ప్రక్రియ, వార్షిక క్యాలెండర్, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన, విభాగాలు, ప్రాజెక్టులు, సీతఈవోల పనితీరును పరిశీలించడానికి తాను వచ్చినట్టు చెప్పారు.

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలను దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ఆలోచన చేస్తున్నారని వివరించారు. దేశంలో తొలి 50 స్థానాల్లో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఉండేలా ప్రణాళికాయుతంగా పనిచేస్తా మన్నారు. సమాజంలో ఉన్న అవకాశాలను యువతకు వివరించాలని, విశాఖలో ఉన్న వివిధ ఇంక్యుబేషన్ కేంద్రాలు, ఎస్‌టీపీఐ తదితర సంస్థలతో పరిశోధకులను అనుసంధానం చేయాలని సూచించారు. ఏయూను మోడల్‌గా తయారుచేస్తే దాన్ని రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాయాల్లో అమలు చేస్తా మని స్పష్టం చేశారు. పేపర్ లెస్ వర్సిటీగా ఏయూను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా సంస్థల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లో ... మిగతా 6వ పేజీలో

ఈపీడీసీఎల్‌లో ఇంటి దొంగలపై విచారణ

- నివేదిక కోరిన కలెక్టర్
- మరోవైపు పీఎం పాలెం స్టేషన్‌కు విజిలెన్స్


విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం ఈపీడీసీఎల్ జోన్-3 (మధురవాడ) ఈఈ కార్యాలయంలో జరిగిన రూ.29 లక్షల ఈపీఎఫ్ నిధుల గోల్‌మాల్‌పై యంత్రాంగం కదిలింది. ఈ నిధులు ప్రభుత్వ ఖాతా నుంచి అటెండర్ వ్యక్తిగత ఖాతాకు మళ్లించాల్సిందిగా లేఖలు రాసిన అధికారిని విడిచిపెట్టి కింది స్థాయి ఉద్యోగులపై చర్యలు చేపట్టారని, పోలీసులకు కూడా సరైన సమాచారం ఇవ్వలేదని 'ఆంధ్రజ్యోతి' మంగళవారం వెలుగులోకి తేవడంతో అధికారులు దీనిపై పునర్విచారణ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఈ అంశంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని విశాఖ సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్‌ను ఆదేశించారు. మరోవైపు పీఎం పాలెం పోలీసులు ఈ కేసును ఎలా విచారించారు?, ఏ నివేదిక తయారుచేశారో తెలుసుకోవడానికి విజిలెన్స్ అధికారులు అక్కడకు వెళ్లారు. అయితే కార్పొరేట్ కార్యాలయం మాత్రం దీనిపై పెదవి విప్పడం లేదు. ఇదిలావుంటే ఈ కుంభకోణం అనంతరం ఆ జోన్ నుంచి వేరే జోన్‌కు మారిన సదరు అధికారి బ్యాంకుకు రాసిన లేఖలపై సంతకం తనది కాదని, ఫోర్జరీ చేశారని చెబుతున్నట్టు తెలిసింది. ఇక్కడ విషయం ఏమిటంటే...ఆ నిధులు అటెండర్ ఖాతాకు మళ్లించాలని ఈఈ లేఖ రాసినట్టు దర్యాప్తు చేసిన పోలీసులకే తెలియదు. నిజంగా ఆ లేఖలో సంతకాలు ఫోర్జరీవి అయితే ఆయన అప్పుడే పోలీసులకు చెప్పి, అందులో నిజాలు నిగ్గు తేల్చమని అడగాల్సింది. కానీ అప్పుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సరైన వివరాలే ఇవ్వలేదు. అసలు ప్రభుత్వ ఖాతా నుంచి వ్యక్తిగత ఖాతాకు దఫదఫాలుగా లక్షలాది రూపాయల నిధులు వెళుతుంటే అప్పుడు అక్కడ ఈఈగా పనిచేసిన అధికారి ఏమి చేసినట్టు?...ఈ వ్యవహారంపై లోతుగా విచారిస్తే అసలు నిధుల మళ్లింపు ఆలోచన ఎవరిది?, ఆ డబ్బుతో ఏమి చేయాలనుకున్నారో తేలుతుంది.



నామినేటెడ్ సందడి

యాప్ ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షుల అభిప్రాయాలు సేకరిస్తున్న టీడీపీ అధిష్ఠానం

- పార్టీకి చేసిన సేవను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశం
- వీఎంఆర్‌డీఏ చైర్మన్ సహా పలు పదవులకు తీవ్ర పోటీ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ఏర్పాటై యాభై రోజులైంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా తెలుగుదేశం నాయకులు తమకు ప్రధాన పోస్టులు దక్కుతాయని ఆశ పడుతున్నారు. గతంలో ఎంతమంది ఎమ్మెల్యేలు సిఫారసు చేస్తే అంత మంచి పోస్టు దక్కేది. ఇప్పుడు టీడీపీ అధిష్ఠానం పూర్తిగా పద్ధతి మార్చేసింది. ఎవరో సిఫారసు చేస్తే కళ్లు మూసుకొని పదవి ఇచ్చే అవకాశం లేదని స్పష్టం చేసింది. పార్టీని నమ్ముకొని, సేవ చేయడంతో పాటు కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలిచి, ప్రతిపక్షం పెట్టిన కష్టాలు ఎదుర్కొని నిలబడ్డ వారికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది.

ఈసారి మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తీసుకోకుండా పార్టీయే ఒక యాప్‌ను ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా పార్టీ అధ్యక్షులకు పంపించి, దానిని పూర్తిచేసి పంపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ నెల రోజుల నుంచి నడుస్తోంది. ఆ యాప్‌లో అన్ని నియోజకవర్గాల సమాచారం, అక్కడి నాయకులు, కార్యకర్తల వివరాలు ఉంటాయి. ప్రతి ఒక్కరికి ఒక కోడ్ ఉంటుంది. ఆ కోడ్ నంబరు ఎంటర్ చేయగానే ఆ నాయకుడు/కార్యకర్త వివరాలు వస్తాయి. పార్టీలో ఎప్పుడు చేరారు?, ఏయే పదవులు నిర్వహించారు? ఎటువంటి సేవలు చేశారు?, ప్రతిపక్షం ఎన్ని కేసులు పెట్టింది?, ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు?...వంటి వివరాలు ఉంటాయి. వాటిని పూరించడంతో పాటు ఆ నాయకుడిపై ఎమ్మెల్యే అభిప్రాయం కూడా నమోదు చేయాలి. అందులోనే ఏ నామినేటెడ్ పోస్టుకు అర్హులో సూచించాలి. ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మె ల్యే, ఎంపీ, జిల్లా అధ్యక్షుల అభిప్రాయాలే పరిగణనలోకి తీసుకుంటారు. పక్క నియోజకవర్గంలో నాయకుడికి మరో నియోజకవర్గం ఎమ్మెల్యే సిఫారసు చేయడం కుదరదు. ఆ యాప్‌లో ఆ ఆప్షన్ పెట్టలేదు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి అవకాశం కల్పించడానికే ఈ విధానం అనుసరిస్తున్నామని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, యువ నాయకుడు లోకేశ్‌లు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు స్పష్టం చేశారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడి అభిప్రాయాలు కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఇబ్బడిముబ్బడిగా నామినేటెడ్ పదవులు పంచిపెట్టారు. వివిధ కార్పొరేషన్లు పెట్టి వాటికి చైర్మన్లను నియమించారు. ఇన్ని పదవులా? అంతా ఆశ్చర్యపోయారు. అదేస్థాయిలో ఇప్పుడు కూటమి నాయకులు కూడా ఆశిస్తున్నారు.

విశాఖపట్నం జిల్లాకు వచ్చేసరికి ప్రధానంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్, పీసీపీఐఆర్ చైర్మన్, మేరీటైమ్ బోర్డు చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, వివిధ ఆలయాలకు చైర్మన్లు, వివిధ బోర్డుల్లో డైరెక్టర్ల పోస్టులు ఉన్నాయి. తూర్పు నియోజక వర్గంలో ఒక నాయకుడు తనకే వీఎంఆర్‌డీఏ పోస్టు వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యే కూడా తన పేరే సిఫారసు చేశారని చెబుతున్నారు. అలాగే ఎస్.కోటకు చెందిన గొంప కృష్ణ పేరు కూడా వినిపిస్తోంది. విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడైన గండి బాబ్జీకి ఎమ్మెల్సీ ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిందని, ఎంపీ శ్రీభరత్ కూడా భరోసా ... మిగతా 6వ పేజీలో

నగరంలో 10 మంది ఎస్‌ఐలకు పోస్టింగులు -వార్త 6వ పేజీలో

సీఐల కలెక్షన్‌పై సీపీ ఆరా

- సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల వసూళ్లపర్వంపై సీపీ శంఖబ్రతబాగ్చి ఆరా తీశారు. కొంతమంది సీఐలు స్టేషన్‌లలో వసూళ్ల కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకోవడంపై 'సీఐల కలెక్షన్' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ కథనంపై సీపీ స్పందించారు. తనకు నమ్మకస్తులుగా ఉన్న అధికారులను పిలిచి దీనికి సంబంధించిన సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయా అధికారులు ప్రాథమిక విచారణలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలో పేర్కొన్న అంశాలన్నీ వాస్తవమేనని నిర్ధారించినట్టు తెలిసింది.

మసాజ్ కేంద్రాలపై పోలీసులు దాడులు

- అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న స్పాపై కేసు నమోదు
- నిబంధనలు పాటించని 21 మసాజ్ సెంటర్లకు నోటీసులు

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మసాజ్ సెంటర్లలో పోలీసులు సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు గుర్తించిన ఒక మసాజ్ సెంటర్‌పై కేసు నమోదు చేశారు. నిబంధనలు పాటించడం లేదని గుర్తించిన మరో 21 మసాజ్‌సెంటర్లకు నోటీసులు జారీచేశారు. మసాజ్ సెంటర్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు నేపథ్యంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆకస్మిక తనిఖీలు చేయాలని ఏసీపీలను ఆదేశించారు. ఈ మేరకు సుమారు 200 మంది పోలీసులు 71 బృందాలుగా ఏర్పడి నగరంలోని 71 మసాజ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకానగర్‌లోని కాక్‌టెయిల్ స్పాలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు గుర్తించి కేసు నమోదుచేశారు. మసాజ్ సెంటర్ యజమాని దుర్గాప్రసాద్, మేనేజర్ బి.ధర్మతోపాటు విటుడిని అదుపులోకి తీసుకున్నారు. కేంద్రంలో ఉన్న ... మిగతా 6వ పేజీలో



ద్వారకానగర్‌లోని స్పాలో తనిఖీ చేస్తున్న పోలీసులు

పాపినేని శివశంకర్‌కి రావిశాస్త్రి సాహితీ పురస్కారం



పాపినేని శివశంకర్‌ను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట, జూలై 30: విశాఖ రసజ్ఞ వేదిక, రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రావిశాస్త్రి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి, విమర్శకులు, కథా రచయిత డాక్టర్ పాపినేని శివశంకర్‌కి ప్రదానం చేసి, సత్కరించారు. ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జీఆర్ శ్రీధర్, డీవీ సూర్యారావు, పురస్కార ప్రదాత రావిశాస్త్రి లిటరరీ వ్యవస్థాపకులు డాక్టర్ రాచకొండ నృసింహశర్మ, అతిథుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందించారు. తొలుత పురస్కార గ్రహితను జేపీ శర్మ పరిచయం చేయగా, పురస్కార సమర్పణను రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి చేశారు. అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ తన అనుభావాలను, రచనలు వివరించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు

విద్యార్థులు రాణించాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

సీతంపేట, జూలై 30: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అక్కయ్యపాలెంలోని నారాయణ ఇ టెక్నో స్కూల్‌లో విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్ చేయరాదని, గంజాయి, మత్తుపదార్థాలకు లోనుకారాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార: మరమ్మతు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార సాయిబాబా ఆలయం, సబ్బం హరి ఇంటి సమీప ప్రాంత వినియోగదారులు గమనించాలని కోరారు.

పగటి వేళ విద్యుత్ కాంతులు!

మురళీనగర్, జూలై 30 ; వీధి దీపాల నిర్వహణ గాడి తప్పింది. మాధవధార ఉడాకాలనీలోని పద్మావతి పార్కులో అమర్చిన హైమాస్ట్ దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. పార్కు నిర్వహణ చూసే కాలనీ సంక్షేమ సంఘం గానీ, పర్యవేక్షించాల్సిన జీవీఎంసీ సిబ్బంది కానీ, చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పగటి పూట విద్యుత్ వెలుగులతో విద్యుత్ వృధా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే, మురళీనగర్ ప్రాంతంలోని హరిత పార్కు, సుదర్శన్ పార్కుల వద్ద దెబ్బతిన్న లైట్లు పగటి పూట వెలగడం, సాయంత్రం వేళల ఆగిపోతుండటంతో పార్కుకు వచ్చేవారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

30వ వార్డులో..

జగదాంబ కూడలి: గ్రేటర్ 30వ వార్డు కుమ్మర వీధిలోని వీధిలైటు నెలరోజులుగా పగటి పూట వెలుగుతోంది. స్తంభం 43 ఏ బై 6 వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్ ఈ విధంగా పగలు వెలుగు పంచుతుండడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు



30వ వార్డు కుమ్మరవీధిలో వెలుగుతున్న వీధిలైటు

వాచ్‌హౌప్ నుంచి పూర్ణామార్కెట్ వరకు రాత్రి పూట వీధిలైట్లు వెలగని పరిస్థితి ఉంది. వార్డు కార్పొరేటర్ అప్పలరత్నం నిత్యం ఈ మార్గంలో తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ విద్యుత్ అధికారులు, సచివాలయం సిబ్బంది పరిస్థితి సరిదిద్దాలని కోరుతున్నారు.



మాధవధారలో వెలుగుతున్న లైట్లు

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించొద్దు

అక్కయ్యపాలెం, జూలై 30: విశాఖలో పోర్టు ఆస్పత్రి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) పద్ధతిన నిర్వహించాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని పోర్టు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి ప్రైవేటీకరణతో పోర్టు ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులకు, కుటుంబ సభ్యులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మసేన్, సీఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కనకారావు, ఇంటక్ అధ్యక్షుడు గొర్లె చందు, సిటూ ప్రధాన కార్యదర్శి పద్మనాభరాజు, హెచ్ఎంఎస్ నాయకుడు మంగయ్య నాయుడు, ట్రస్ట్‌బోర్డు సభ్యు డు పోతన్న, వీరాంజనేయరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

కొండవాలు ప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టి

» ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు



ట్రాక్ సూట్లు అందిస్తున్న విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, జూలై 30: కొండవాలు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ హామీ ఇచ్చారు. 48వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వార్డులో సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో వీధిదీపాల వెలగడంలేదని తెలిపారు. 48గంటల్లోగా అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే తెలిపారు. కొండవాలు గ్రామాల్లో పార్కింగ్‌కు అవకాశం లేక, వాహనాలను జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో నిలుపుతున్నట్లు తెలిపారు. ఈక్రమంలో ఆటోలు, ద్విచక్రవాహనాలు, వాటి విడి విభాగాలు చోరీకి లోనవుతున్నట్లు కార్పొరేటర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

బృందావన్ పార్కు అభివృద్ధి చేయండి

మురళీనగర్ ; మురళీనగర్ బృందావన్ పార్కుని మరింతగా ప్రజోపయోగంగా తీర్చిదిద్దాలని కోరుతూ పార్కు కమిటీ సభ్యులు, మురళీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకి వినతి పత్రం అందించారు. పార్కులో ఆడిటోరియం నిర్మాణం, లైట్లు, వాకింగ్ ట్రాక్, వ్యాయామ సామగ్రి ఏర్పాటు చేయాలని కోరారు. పార్కు కమిటీ కార్యదర్శి మురళీ, మురళీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ట్రాక్ సూట్లు పంపిణీ

అక్కయ్యపాలెం: పోర్టు స్టేడియంలోశిక్షణ పొందుతున్న అథ్లెటిక్ క్రీడాకారులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ట్రాక్ సూట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తరం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ 43వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్,విశ్వనాథ కన్వెన్షన్ అధినేత బి.కాశీవిశ్వనాథ్, గొలగాని సౌజన్య పాల్గొన్నారు.

మద్దిపాలెం: అసెంబ్లీలో బీజేపీ ఫ్లోర్‌లీడర్‌గా నియమితులైన విష్ణుకు మార్‌రాజును 54వ వార్డు జనసేన అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.బోడసింగి శ్రీధర్, పాండ్రంకి దివాకర్ కడిమి సీతారాం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహనీయులు ఆత్రేయ, సినారె

» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



సినీనిర్మాత కంచర్ల అచ్యుతరావును సన్మానిస్తున్న గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు

డాబాగార్డెన్స్, జూలై 30: తమ సాహిత్యం ద్వారా రేలుగు పాటకు జీవం పోసిన మహనీయులు ఆత్రేయ, సినారె అని మాజీ మంత్రి, భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత డా.సి. నారాయణరెడ్డి 94వ జయంత్యుత్సవం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఉపకార్ ట్రస్ట్ ఛైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావును సినారె పురస్కారంతో సన్మానించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు నిర్వాహకుల కృషిని అభినందించారు. పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, సూరపనేని విజయ్‌కుమార్, గ్రంధి విష్ణు, ఉశిరికల చంద్రశేఖర్, చెన్నా తిరుమలరావు, శోభన్‌ప్రకాష్, ఎస్ఎస్ఎస్ఎన్ రాజు, ఉమామహేష్, లక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాయనీగాయకుల ఆలపించిన గీతాలు అలరించాయి.

జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారానికి కృషి

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు వినతిపత్రమిస్తున్న జర్నలిస్టులు

సీతంపేట, జూలై 30: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ కార్యవర్గం మంగళవారం పల్లా శ్రీనివాసరావుని కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను కార్యవర్గ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షులు జనార్దన్, అధ్యక్షులు బి.ర వికాంత్, కార్యవర్గ సభ్యులు దవలేశ్వరపు రవికుమార్, కోశాధికారి అలపాటి శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం: కలెక్టర్

మహారాణిపేట, జూలై 30: రైతు ఉత్పత్తిదారు సంఘాలకు తగిన ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎఫ్‌పీవోల జిల్లా మానటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లాలోని వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో చర్చించారు రాష్ట్ర, కేంద్ర పథకాలను రైతులకు చేరువయ్యేలా చూడాలన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెటింగ్ అవకాశాలు, స్టోరేజీ సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కలిగించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. పంటలకు గిట్టుబాటు వచ్చేలా ఉత్పత్తిదారుల సంఘా లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఫ్‌పీవోవిధానంతో దీర్ఘకాలిక ఆర్థిక ప్రయో జనాలు మార్కెటింగ్ అవకాశాల వివరించాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు బసంతకుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట, జూలై 30: విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి విభిన్న ప్రతిభావంతుల కమిటీ అధ్యక్షుడు, 25వ వార్డు సీతంపేటకు చెందిన టీడీపీ నాయకుడు ఇసరపు వాసు తీసుకువచ్చారు. మంగళగిరిలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఈ మేరకు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు.



లోకేశ్‌కు వినతిప త్రమిస్తున్న వాసు

నగరంలో పది మంది ఎస్ఐలకు పోస్టింగ్‌లు

మహారాణిపేట, జూలై 30: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పదిమంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఎస్ఐలను నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి. శ్యామలరావు విశాఖలోని మల్కాపురం లాండ్ అండ్ ఆర్డర్‌కు, పి.డి.వి. రవిశంకర్ ఆరిలోవ స్టేషన్‌కు బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పి.వి. రమణ మల్కాపురం క్రైమ్‌కు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన డి. సూరిబాబు పెందుర్తి క్రైమ్‌కు, ఎన్. సింహాచలం టూటౌన్ లా అండ్ ఆర్డర్ స్టేషన్‌కు, కె. నరసింగరావు నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ బదిలీ చేశారు. కోట మహంతి శ్రీనివాసరావు వన్‌టౌన్ స్టేషన్‌కు బదిలీ జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కె. దేముడు నాయుడు సీసీఎస్‌కు, పి.వి. రమణారెడ్డి దువ్వాడ క్రైమ్‌కు, కె. సత్యనారాయణను నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏయూలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలి

అక్కయ్యపాలెం, జూలై 30: ఆంధ్ర యూనివర్శిటీలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కోరారు. మంగళవారం ఏయూకి వచ్చిన ఆయనకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో ఇంజనీరింగ్ కళాశాలలో గ్రంథాలయ ఉద్యోగాలను నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. జేఎల్ఎల్ ఉద్యోగాలుభర్తీలు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ వయోపరిమితిని జనరల్ అభ్యర్థుల 47కు పెంచాలని చెప్పారు. న్యాయపరమైన సమస్యలను తొలగించి ఏయూతో పాటు అన్ని విశ్వ విద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఉద్యోగ భర్తీ చేపట్టాలని పేర్కొన్నారు.

రోడ్డుపై వ్యాపారాలకు నిరోధానికి చర్యలు

పూర్ణామార్కెట్, జూలై 30: పూర్ణామార్కెట్‌లో రోడ్డుమీద వ్యాపారాలను నిరోధించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తామని జోన్ 4 కమిషనర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆశీల కాంట్రాక్టర్ వాహనాల పార్కింగ్ సబ్ కాంట్రాక్టర్‌కు ఇవ్వ డంతో పరిసర రోడ్డుపై ఇష్టానుసారం జంగిళ్ల వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. వీటిరి నిరోధించాలని ఆదేశించినట్టు చెప్పారు. ట్రాఫిక్ పోలీసుల సహకారంతో రోడ్డుపై వ్యాపారాలకు అనుమతించేదిలేదన్నారు. ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు సోమవారం వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

రసవత్తరంగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

వీడి కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జనసేనకు మద్దతు ప్రకటించిన ఐదుగురికి అధికారికంగా పార్టీ కండువా కప్పలేదు. దీనికోసం రెండుసార్లు ముహూర్తాలు పెట్టుకున్నప్పటికీ పార్టీ అధిష్ఠానం నుంచి అభ్యంతరం వ్యక్తమవ్వడంతో చేరికలకు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీడీపీలో చేరేందుకు మరికొందరు వైసీపీ కార్పొరేటర్లు ఆసక్తిగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేలు, ఆయా వార్డుల్లోని నాయకులు, కార్యకర్తల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అయితే స్టాండింగ్ కమిటీకి వచ్చే నెల ఏడో తేదీన ఎన్నిక జరగబోతుండడంతో ఆలోగా చేరికలను పూర్తిచేయాలని టీడీపీ నేతలు తాపత్రయపడుతున్నారు. దీనికోసం ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసి తమ గోడు వినిపిస్తున్నారు.

ఇదిలావుండగా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో జనసేన కార్పొరేటర్లలో ఒక్కరికి కూడా అవకాశం కల్పించకపోవడంతో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కొందరు అసంతృప్తితో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే టీడీపీలో ఏళ్ల తరబడి ఉంటూ స్టాండింగ్ కమిటీలో పనిచేయాలని తహతహలాడిన కొందరు కార్పొరేటర్లకు అవకాశం దక్కకపోవడంతో వారిలో కొందరు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. వీరిలో ఎవరైనా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తారేమోననే ఆందోళన కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఉంది. ఒకవేళ అలాంటిదేమైనా జరిగినా ఇబ్బంది లేకుండా ఉండాలంటే కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వైసీపీ కార్పొరేటర్లలో కనీసం పది మందినైనా తీసుకోవాలని ఎమ్మెల్యేలను కోరుతున్నారు. అలా చేస్తే ఒకరిద్దరు క్రాస్ ఓటు వేసినా, అభ్యర్థుల గెలుపునకు ఢోకా ఉండదని వివరిస్తున్నట్టు సమాచారం. మరోవైపు వైసీపీ కార్పొరేటర్లలో కూడా చాలామంది పార్టీ నేతల వైఖరిపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. అధికారంలో ఉన్నంతకాలం కనీసం తమను పట్టించుకోలేదనే ఆగ్రహంతో ఉన్నారు. కొందరు టీడీపీ, జనసేనలో చేరిపోయేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ, ఆయా పార్టీల నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో వేచిచూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ పార్టీలో ఉన్నప్పటికీ వైసీపీ నుంచి పోటీ చేసేవారికి కాకుండా కూటమి మద్దతుతో పోటీచేస్తున్న వారికి ఓటు వేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వైరిపక్షంలో అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను గుర్తించి తాయిలాలు ఇచ్చి, తమ అభ్యర్థులకు ఓటు వేయించుకోవాలని ఇరువర్గాలు వ్యూహరచన చేస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో క్రాస్ ఓటింగ్ భయం ఇరువర్గాలను వెంటాడుతోందని చెప్పుకోవాలి.

వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఏయూ

... 5వ పేజీ తరువాయి

ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షు రాలు ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరిదేవి, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. అంతకుముందు ఏయూ మెరైన్ లివింగ్ రీసోర్సెస్ సెంటర్‌లో అవంతి స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను సౌరబ్ గౌర్ సందర్శించారు.

గత వీసీ హయాంలో అవకతవకలపై చర్యలు

అనంతరం మీడియాతో మాట్లాడిన సౌరబ్ గౌర్ గత వీసీ హయాంలో జరిగిన అవకతవకలు ప్రభుత్వం దృష్టికి వచ్చా యని, వీటిపై చర్యలు తీసుకుంటామన్నారు. విశ్వవిద్యా లయాల్లో అధ్యాపకుల నియామకాన్ని ప్రాధాన్యత అంశంగా పెట్టుకున్నట్టు వివరించారు. రెగ్యులర్ వైస్ చాన్సలర్ల నియా మకానికి ప్రణాళికలు తయారుచేస్తున్నట్టు వివ రించారు. ఏయూను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఏయూలో 58 విభాగాలు, పది సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గత వీసీ అక్రమాలు, అన్యా యాలపై పలువురు ఫిర్యాదులు చేశారు. ఉద్యోగులు ఇబ్బందులు, డిమాండ్లకు సంబంధించి వినతులను స్వీక రించారు.

ఫిర్యాదు చేసిన అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్

ఏయూ అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో సౌరబ్ గౌర్‌ను కలిసిన పలువురు పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. కృష్ణా యూనివర్సిటీ నుంచి, ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలని కోరారు. అనైతికంగా, అడ్డగోలుగా జగన్మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన బదిలీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు అధ్యాపకులు, స్కాలర్స్ సంతకాలతో ఫిర్యాదును చేశారు.

నామినేటెడ్ సందడి

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారని సమాచారం. అటు జనసేన, బీజేపీ నాయకులు కూడా ఎంతో కొంత తమకూ ప్రాధాన్యం ఉంటుందని భావిస్తున్నారు. జనసేనలో చాలామంది ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఏర్పాట్లు చేసుకున్నారు. పొత్తులో భాగంగా వారంతా కూటమి అభ్యర్థులకు సహకరించారు. జిల్లాలో ఆ విధంగా చూసుకుంటే కోన తాతారావు, పంచకర్ల సందీప్, పసుపులేటి ఉషాకిరణ్ వంటివారు ఉన్నారు. పార్టీకి పెద్ద దిక్కుగా బొలిశెట్టి సత్య, శివశంకర్ వంటి వారు పనిచేశారు. బీజేపీలో కూడా పార్టీకి పనిచేస్తూనే కూటమి అభ్యర్థుల గెలుపునకు పనిచేసిన వారున్నారు. అందరినీ సమన్వయం చేసుకొని దామాషా పద్ధతిలో నామినేటెడ్ పోస్టులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

మసాజ్ కేంద్రాలపై పోలీసులు దాడులు

... 5వ పేజీ తరువాయి

ఆరుగురు మహిళలను పునరావాస కేంద్రానికి తరలించారు. మరో 21 మసాజ్ సెంటర్లకు ట్రేడ్ లైసెన్సులు, లేబర్ సర్టిఫికెట్‌లో పేర్కొన్నదానికంటే అదనంగా ఉద్యోగులు ఉండడం, జీఎస్టీ సర్టిఫికెట్ లేకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించి నోటీసులు జారీచేశారు.వీటిపైచర్యలకు సంబంధిత శాఖలకు సమాచారం అందించారు. నిబంధనలు పాటించని స్పాలు, మసాజ్ సెంటర్ల గురించి ఎవరికైనా తెలిస్తే సీపీ హెల్ప్‌లైన్ నంబర్ 7995095799కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

అర్హులందరికీ గృహాలు అందిస్తాం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

మహారాణిపేట, జూలై 30: కూటమి ప్రభుత్వం అర్హులందరికీ గృహాలు అందించనుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకుల పాలనలో 20 ఏళ్ల రాష్ట్రం వెనక్కి వెళ్లిపోయిందన్నారు.కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఖజానాలో ఒక్క రూపాయి లేకుండా చేశారని తెలిపారు. అయినా, హామీలు నిలుపుకోవడానికి ఉమ్మడి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఉద్యోగులకు పెన్షన్, జీతాలు ఇవ్వలేకపోయారన్నారు. అటువంటి పాలన వల్లే ప్రజలు వైసీపీని ఎన్నికల్లో బంగాళాఖాతంలో తోసేశారని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నిస్తోందన్నారు. జగనన్న ఇళ్ల పథకం అవినీతిమయంగా మారిందన్నారు. ఒక్కరికి ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవని, రూ. కోట్లలో డబ్బు దోచుకున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన డబ్బును తమదిగా ప్రచారం చేశారన్నారు. తాము ప్రతీ ఒక్కరికి ఇల్లు కేటాయిస్తామని, జర్నలిస్టులకు ఇళ్లు ఇచ్చేందుకు చంద్రబాబు సుముఖంగా ఉన్నారన్నారు. జగనన్న కాలనీలన్నీ చెరువులుగా మారాయన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేశారన్నారు. అనకాపల్లిలో 28 వేలు, విశాఖ నగర పరిధిలో 3 వేల ఉన్నాయన్నారు. చంద్రబాబు ఈ ఇళ్లను అందించి ప్రజల కల నెరవేర్చనున్నట్టు పేర్కొన్నారు. 100రోజుల్లో 1.25 లక్షల గృహాలు, ఏడాదిలో 8.25 లక్షల గృహాలు నిర్మాణం లక్ష్యం గా తీసుకున్నట్టు వివరించారు. గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పునఇస్తామన్నారు.ఈ సమావేశంలో గొంపా సత్యనారాయణ, గోపాలరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గండి బాబ్జీ

రంగసాయి పురస్కారానికి తనికెళ్ల భరణి ఎంపిక

డాబాగార్డెన్స్, జూలై 30: రంగసాయి నాటక సంఘం 14వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆగస్టు 1న సినీ రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి రంగసాయి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్టు సంఘం వ్యవస్థాపకులు బాదంగీరి సాయి తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కళాభారతి ఆడిటోరియంలో సాయంత్రం 6గంటలకు ఈ కార్య క్రమం ప్రారంభమవుతుందన్నారు. రంగస్థలం కళాకారులకు రంగసాయి థియేటర్ అవార్డ్స్ కళాకారులు ఎస్.ఎం. బాషా, వి.సతీష్‌కుమార్, బి.వెంకట రామారావు, కె.మంగాదేవి, బి.రితిష్‌కు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో నిర్వాహకులు ఎన్ఎస్ఆర్, శివజ్యోతి, రవి బ్రహ్మ, నవరసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ ఆశీలు వేలం ఖరారు

జగదాంబ కూడలి, జూలై 30: సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్) ఆశీల వేలం రూ. 52.50 లక్షలకు ఖరారైంది. మంగళవారం ఉదయం జీవీఎంసీ జోన్ 4 కార్యాలయంలో రెవెన్యూ అధికారులు ఈ వేలం నిర్వహించారు. ఇప్పటికే రెండుసార్లు నిర్వహించినా పోరం సరిపోక వేలం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఇద్దరు కాంట్రాక్టర్లు హాజరయ్యారు. జోన్ 4 రెవెన్యూ అధికారులు వేలం కొనసాగించారు. బి.శ్రీరామమూర్తి రూ. 52.50 లక్షలకు ఈ ఆశీల వేలం దక్కించుకున్నారు. ఎనిమిది నెలల కాల పరిమితికిగాను ఆశీల కాంట్రాక్టు కొనసాగుతుంది.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

రామకృష్ణా రైతుబజారు ఆశీలు వేలం వాయిదా

వన్‌టౌన్ పరిధిలోని రామకృష్ణా రైతుబజారు ఆశీలు వసూలు వేలం మంగళవారం మరోసారి వాయిదా పడింది. కాంట్రాక్టర్లు హాజరుకాకపోవడంతో మరోసారి వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

నగర అభివృద్ధికి కృషి చేశా..

» జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ రవికృష్ణరాజు

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా మూడేళ్లలో నగర అభివృద్ధికి తనవంతు కృషి చేసినట్టు పి. రవికృష్ణరాజు తెలిపారు. చీఫ్‌ఇంజనీర్‌గా బుధవారం ఉద్యోగ విరమణ చేస్తున్ననేపథ్యంలో తన హయాంలో చేపట్టిన అభివృద్ధిపనులను వివరించారు. దీర్ఘకాలంగా నిలిచిన అడవివరం, పాతగోశాల బీఆర్‌టీఎస్‌రోడ్డు, జ గదాంబ జంక్షన్‌నుంచి పాతపోస్టాఫీస్ వరకూ రోడ్డు విస్తరణ, అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ, అనకాపల్లిలో పెరుగుబజార్‌రోడ్డు పూర్తి చేసినట్టు వివరించారు. కె.నగరంపాలెం రోడ్డు నిర్మాణం, 15 ప్రధాన కూడళ్ల అభివృద్ధి, వాటర్‌ఫౌంటెయిన్ల ఏర్పాటు, వీఎంఆర్‌డీఏ పార్కు, వన్‌టౌన్‌లో హెరిటేజ్ భవనాల అభివృద్ధి, ఎంవీపీ కాలనీలో స్పోర్ట్స్ ఏరీనాను పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చానన్నారు. కడపజిల్లా ప్రొద్దుటూరికి చెందిన తాను 1986లో పంచాయతీరాజ్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేరి వివిధ హోదాల్లో 37 ఏళ్లపాటు పనిచేశానన్నారు.



రవికృష్ణరాజు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

పెందుర్తి, జూలై 30: ఇక్కడి వెంకటాద్రి శిఖరం దిగువన గల సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం ఆడై కృత్తికను నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అంతకుముందు గర్భాలయం చుట్టూ భక్తులు ముమ్మార్లు ప్రదక్షిణలు చేస్తూ కావిడి ఉత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి పూజల్లో మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

86వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని 'పల్లా'కు వినతి



'పల్లా'కు వినతిపత్రం అందజేసిన నల్లూరు, తదితరులు

గాజువాక, జూలై 30: జీవీఎంసీ 86వ వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లలో వార్డులో అభివృద్ధి కుంటు పడిందన్నారు. అందువల్ల వార్డులోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దీనిపై పల్లా మాట్లాడుతూ వార్డులోని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాడిన కనకరాజు, వేగుంట శ్రీను పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లను పరిశీలించిన జెడ్సీ

మల్కాపురం, జూలై 30: పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీహరిపురం, గాజువాక ఆర్టీసీ డిపోల వద్దనున్న అన్న క్యాంటీన్లను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ మంగళవారం పరిశీలించారు. త్వరలో అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్న నేపథ్యంలో ఇవి ఎలాగున్నాయో ఇంజనీరింగ్ అధికారులను అడిగి మాట్లాడి తెలుసుకున్నారు. ఇప్పటికే అన్న క్యాంటీన్లకు మరమ్మతులు జోరుగా సాగుతున్నాయి. ఆయన వెంట ఏఈ ఉష, తదితరులు ఉన్నారు.

పీఎం మోదీ కార్యక్రమాన్ని వీక్షించిన వాసీవా ప్రతినిధులు

ఆటోనగర్, జూలై 30: విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) కార్యాలయంలో మంగళవారం పీఎం మోదీ వికసిత్ భారత్-ఏ పోస్ట్ యూనియన్ బడ్జెట్ కాన్ఫరెన్స్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని వాసీవా సభ్యులు, సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ), పారిశ్రామికవేత్తలు వీక్షించారు. ఈ సందర్భంగా వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగప్రసాద్ మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో పీఎం మోదీ విశ్లేషణాత్మకమైన సందేశాలు పారిశ్రామికవేత్తలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వాసీవా ప్రతినిధులు రామ్‌ప్రసాద్, పరుచూరి ప్రభాకర్, శ్రీనివాసరాజు, రామభద్రరాజు, ఐలా మాజీ ఛైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షునిగా రాము

పెందుర్తి, జూలై 30: పెందుర్తి గ్రామీణ (రూరల్) మండల ఓబీసీ అధ్యక్షునిగా రాంపురానికి చెందిన బైలపూడి రాము నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు జిల్లా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఓబీసీలే బీజేపీ డీఎన్ఏ అని అన్నారు.

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 28, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 28, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 38, అరటికాయ (పెద్దది)6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 64, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడుచిక్కుడు 78, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	82
ఫారం ధర	--	102
విత్ స్కిన్	--	174
స్కిన్‌లెస్	--	184

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

వంతెనపై ఆగిపోయిన కంటెయినర్ వాహనం

మూడు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్

తీవ్ర ఇబ్బందులకు గురైన ఇతర వాహనదారులు





ఆగిపోయిన కంటెయినర్ వాహనం వద్ద గుమిగూడిన ఇతర వాహనదారులు.. పక్కన బారులుతీరి నిలిచిపోయిన వాహనాలు

మల్కాపురం, జూలై 30: డాక్‌యార్డు సమీపంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనపై మంగళవారం ఓ కంటెయినర్ వాహనం ఆగిపోవడంతో సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో అధిక సంఖ్యలో వాహనాలు బారులుతీరి నిలిచిపోవడంతో వందలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వంతెనపై ఆగిపోయిన కంటెయినర్ వాహనానికి సంబంధించిన డ్రైవర్ కూడా అక్కడ లేకపోవడంతో పలువురు వాహనదారులు ఆ వెహికల్‌పై ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేసి మాట్లాడారు. వంతెనపై వాహనం ఎందుకు ఆగిపోయింది, దీనిని పక్కకు తీయించాలని కోరినా సదరు వ్యక్తి నుంచి సరైన సమాధానం రాలేదు. ఈలోగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ కంటెయినర్ వాహనంలో డీజిల్ వేయించి, క్రేన్ సహాయంతో వంతెన పైనుంచి కొంత దూరం తీసుకువెళ్లి పక్కన పెట్టారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలి



అగనంపూడిలో ఇసుక డిపోను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్, తదితరులు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

అగనంపూడి, జూలై 30: జిల్లాలో అమలు జరుగుతున్న ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అగనంపూడి ఇసుక డిపోను మంగళవారం ఆయన పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సులభతరంగా ఇసుక పంపిణీ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇసుక సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలను పారదర్శకంగా అమలు చేయాలని పేర్కొన్నారు. జేఈ వెంట ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, గనుల శాఖ ఉప సంచాలకులు రాజు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ రంగాలతోనే ఉపాధి అవకాశాలు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్



కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, జూలై 30: ఉపాధి అవకాశాలకు ప్రభుత్వ రంగ పరిశ్రమలే కీలకమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,265వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటించేంత వరకు ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారంలో సాధారణ ఉత్పత్తి చేయడానికి ముడిసరకు కొరత ఉందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడిని పెంచాలన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్ ప్లాంటును కూటమి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ, కర్మాగారంలో జరుగుతున్న అవకతవకలు, తదితర సమస్యలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను కలిసి వివరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వల్ల స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమవుతుందని అందరం నమ్ముతున్నా మన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును సొంత గనులు కేటాయిస్తూ, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, డి.శ్రీనివాస్, గోపి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై ఇంటక్ రాజీ లేని పోరాటాలు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటు కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించి, కార్మిక సంక్షేమానికి కృషి చేయాలని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పేర్కొన్నారు. ప్లాంట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందునే పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. నలభై ఏళ్లుగా కార్మిక సంక్షేమానికి ఇంటక్ మాత్రమే పోరాటాలు చేస్తోందని, ప్రస్తుతం కొన్ని కార్మిక సంఘాల నాయకులు మాత్రం తమ పబ్బం గడుపుకునేందుకు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్మికులకు, సంస్థకు ఏ ఇబ్బంది వచ్చినా తక్షణమే స్పందించింది ఇంటక్ మాత్రమేనన్నారు. సమావేశంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, బీఎస్ రాజు, సీహెచ్ సుదర్శనరావు, నాయక్, కొమ్ము ప్రసాద్, ప్రభాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మిక శాఖా మంత్రిని కలిసిన బీఎంఎస్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 30: కూటమి ప్రభుత్వ హయాంలో కార్మిక వర్గానికి మంచి జరిగేలా చూడాలని కోరుతూ బీఎంఎస్ నాయకులు మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాశ్‌కు వినతిపత్రం అందజేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలను అందుబాటులోకి తేవాలన్నారు. కొన్ని సంస్థల్లో విధులు నిర్వర్తించే కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబం తీవ్రంగా నష్టపోతుందన్నారు. స్టీల్‌ప్లాంటులోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు లోవరెడ్డి, ఎంవీఎస్ నాయుడు, లాలం ప్రసాద్, రాందాస్ నరేంద్ర, రొక్కం సురేశ్, తదితరులు ఉన్నారు.

57వ వార్డులో ఎమ్మెల్యే గణబాబు పర్యటన



తుమ్మడిపాలెంలో గెడ్డ పరిశీలిస్తున్న గణబాబు, జెడ్సీ కృష్ణ

ఆర్పీపేట (కంచరపాలెం), జూలై 30: జీవీఎంసీ 57వార్డు పరిధి సుభాశ్ నగర్, తుమ్మడిపాలెం, భవానీ గార్డెన్స్ ప్రాంతాల్లో మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని కాలువలు, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, విద్యుత్, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గణబాబు పేర్కొన్నారు. తుమ్మడిపాలెంలోని ప్రధాన గెడ్డకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను గణబాబు ఆదేశించారు. అలాగే పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జెడ్సీ కృష్ణకు సూచించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, నాయకులు అప్పలరాజు, మూర్తి, సుధ, శ్రీరామమూర్తి, తదితరులు ఉన్నారు.

ఘనంగా జువ్వాలమ్మ మారువారం పండగ



పుట్టరూపంలో ఉన్న జువ్వాలమ్మ

వేపగుంట, జూలై 30: నాయుడుతోట, గౌతమ్‌నగర్, పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత జువ్వాలమ్మ మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పుట్ట రూపంలో కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అమ్మవారిని కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బల్ల రాంబాబు, జి.అప్పలనాయుడు, శేషు, ఎన్.నాయుడు, గోవింద్, బాపుజీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

గోపాలపట్నం, జూలై 30: ఇక్కడి మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గురుకుల పాఠశాలలో మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు ప్రబల కుండా తీసువాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సుమారు 545 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి పలువురికి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మృదుల ప్రియదర్శిని, వైద్యాధికారి డాక్టర్ జి.విష్ణు, వైద్యాధికారులు డాక్టర్ ఎస్.అశ్విని, పీవీ నరసింహరావు, పీహెచ్ఎన్ దేవి, తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేటు టెండర్‌ను రద్దు చేయాలని వినతి

అగనంపూడి, జూలై 30: అగనంపూడి టోల్‌గేటు పునఃప్రారంభానికి ఎన్‌హెచ్ఏఐ అధికారులు జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమన్వయకర్త బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌హెచ్ఏఐ పీడీ ప్రభాత్ రంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ టోల్‌గేటు ఉందని, దీనికి ఎప్పుడో కాలం చెల్లిందన్నారు. శాశ్వతంగా ఎత్తివేయాల్సిన సమయంలో టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేయడం తగదన్నారు. పీడీని కలిసిన వారిలో సమితి ప్రతినిధులు ఓంకార్, శ్రీనివాస్, శామ్యూల్ కుమార్, తదితరులు ఉన్నారు.

శబ్ద కాలుష్యాన్ని నివారించాలని కలెక్టర్‌కు..

పెదగంట్యాడ: పారిశ్రామిక ప్రాంతంలో శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు కేఎల్‌రావు నగర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు జి.సందీప్‌రెడ్డి మంగళవారం వినతపత్రం అందజేశారు. అందుకు సంబంధించిన ప్రతులను జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడుకు, పెదగంట్యాడ న్యూపోర్టు సీఐ దాలిబాబుకు అందజేశారు. బాలచెరువు రోడ్డులో కాకతీయ జంక్షన్ నుంచి పెదగంట్యాడ వరకు జనావాసాల మధ్య కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ అధికంగా ఉన్నాయని, ఆయాచోట్ల నిత్యం జరిగే శుభ కార్యాల వల్ల రాత్రి, పగలు తేడా లేకుండా బాణసంచాను కాలుస్తుండడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అందువల్ల బాణసంచా వినియోగాన్ని నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

కల్యాణ మండపం నిర్మించాలని ఎమ్మెల్యేకు..

గోపాలపట్నం: గ్రేటర్ 91వ వార్డు పరిధి లక్ష్మీనగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండపం నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని జైభీమ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుకు వినతిపత్రం అందజేశారు. సుమారు పదివేల మంది జనాభా ఉన్న కాలనీలో కల్యాణ మంపడ నిర్మాణం జరగక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని త్వరితగతిన నిర్మించాలని కోరారు. గణబాబును కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు కె.ప్రసాద్, బండి దుర్గేశ్, తదితరులు ఉన్నారు.

కాలువ నిర్మాణ పనులు పరిశీలన

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 30: జీవీఎంసీ 90వ వార్డు పరిధి ఏపీఎంసీబీ కాలనీ సమీపంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద తరచూ ఏర్పడుతున్న డ్రైనేజీ ఇబ్బందులకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఈ సమస్యపై కార్పొరేటర్ బొమ్మిడి రమణకు పాఠశాల యాజమాన్యం, స్థానికులు ఫిర్యాదు చేయటంతో ఆయన స్పందించి జీవీఎంసీ నిధులు రూ.ఏడు లక్షలతో కాలువ నిర్మాణం చేపట్టారు. మంగళవారం ఆయా పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ వెంట వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, స్థానిక నాయకుడు జీవన్, తదితరులు ఉన్నారు.



నడుపూరులో రిటెయినింగ్ వాల్ లేని కాలువ

ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీల మరమ్మతులకు చర్యలు

గాజువాక, జూలై 30: వర్షాకాలం నేపథ్యంలో ప్రధాన డ్రైనేజీలతో పాటు ముంపు ప్రాంతాల్లోని కాలువల పునరుద్ధరణ పనులపై అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు ఆయా డ్రైనేజీలపై సంబంధిత విభాగం సిబ్బంది సర్వే చేస్తున్నారు. సర్వే ఆధారంగా డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఇప్పటికే కొన్ని వార్డుల్లో జీర్ణావస్థకు చేరుకున్న డ్రైనేజీలకు మరమ్మతు పనులు ప్రారంభించగా, మిగతా కాలువలకు కూడా పూర్తి స్థాయిలో ఆధునీకరించనున్నారు. డ్రైనేజీలను బాగు చేస్తే భారీ వర్షాల సమయంలో మురుగు నీరు రహదారులపై ప్రవహించకుండా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఆ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా ముంపు సమస్య అధికంగా ఉన్న స్వతంత్ర నగర్, బర్మా కాలనీ, నడుపూరు కాలనీ, ఎస్టీ కాలనీ, కుంచమాంబ కాలనీ, తదితర ప్రాంతాల్లో జీర్ణావస్థలో ఉన్న కాలువలకు త్వరితగతిన మరమ్మతు పనులను ప్రారంభించనున్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ధర్నా



ప్లకార్డులు, బ్యానర్ ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 30: స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. జీతాలు చెల్లించాలంటూ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో కష్టించి పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం భావ్యం కాదన్నారు. ఉక్కు ఉత్పత్తి పెంచేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉన్నా.. యాజమాన్యం అందుకు సరిపడా ముడిసరకును సమకూర్చడం లేదన్నారు. ఇప్పటికైనా కార్మికులను ఇబ్బందులకు గురి చేసే చర్యలను యాజమాన్యం విడనాడాలని పేర్కొన్నారు. కేవలం ఉద్యోగుల జీతాల కింద రూ.90 కోట్లు చెల్లించేందుకు యాజమాన్యం నిర్లక్ష్యంగా వహిస్తుండడం దారుణమన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) స్తోభితో సమావేశమై సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, టీవీకే రాజు, మరిడయ్య, నీలకంఠం, అరుణ్‌కుమార్, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేత

అగనంపూడి, జూలై 30: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అట్టవానిపాలెంలోని క్రీడాకారులకు జనసేన నాయకుడు విందుల వెంకటరమణ మంగళవారం వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలన్నారు. ప్రతిఒక్కరూ క్రీడల్లో పాల్గొంటూ తమ ప్రతిభను కనబరచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ

పెందుర్తి, జూలై 30: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ శేనాపతి వసంత అన్నారు. 97వ పరిధి చినముషిడివాడ సచివాలయ పరిధిలో స్థానిక పాఠశాల విద్యార్థులతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన కార్పొరేటర్ మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో అతిసార, దోమ కాటుతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలనున్నాయన్నారు. వీటి నివారణ, నియంత్రణకు పరిసరాల పరిశుభ్రత అవసరం అన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులు నివారణపై ఆమె ప్రతిజ్ఞ చేయించారు. వైద్యులు అమీషా పాల్గొన్నారు.

పాపినేని శివశంకర్‌కి రావిశాస్త్రి సాహితీ పురస్కారం



పాపినేని శివశంకర్‌ను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట, జూలై 30: విశాఖ రసజ్ఞ వేదిక, రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రావిశాస్త్రి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి, విమర్శకులు, కథా రచయిత డాక్టర్ పాపినేని శివశంకర్‌కి ప్రదానం చేసి, సత్కరించారు. ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జీఆర్ శ్రీధర్, డీవీ సూర్యారావు, పురస్కార ప్రదాత రావిశాస్త్రి లిటరరీ వ్యవస్థాపకులు డాక్టర్ రాచకొండ నృసింహశర్మ, అతిథుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందించారు. తొలుత పురస్కార గ్రహితను జేపీ శర్మ పరిచయం చేయగా, పురస్కార సమర్పణను రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి చేశారు. అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ తన అనుభావాలను, రచనలు వివరించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు

విద్యార్థులు రాణించాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

సీతంపేట, జూలై 30: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అక్కయ్యపాలెంలోని నారాయణ ఇ టెక్నో స్కూల్‌లో విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్ చేయరాదని, గంజాయి, మత్తుపదార్థాలకు లోనుకారాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార: మరమ్మతు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార సాయిబాబా ఆలయం, సబ్బం హరి ఇంటి సమీప ప్రాంత వినియోగదారులు గమనించాలని కోరారు.

పగటి వేళ విద్యుత్ కాంతులు!

మురళీనగర్, జూలై 30 ; వీధి దీపాల నిర్వహణ గాడి తప్పింది. మాధవధార ఉడాకాలనీలోని పద్మావతి పార్కులో అమర్చిన హైమాస్ట్ దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. పార్కు నిర్వహణ చూసే కాలనీ సంక్షేమ సంఘం గానీ, పర్యవేక్షించాల్సిన జీవీఎంసీ సిబ్బంది కానీ, చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పగటి పూట విద్యుత్ వెలుగులతో విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే, మురళీనగర్ ప్రాంతంలోని హరిత పార్కు, సుదర్శన్ పార్కుల వద్ద దెబ్బతిన్న లైట్లు పగటి పూట వెలగడం, సాయంత్రం వేళల ఆగిపోతుండటంతో పార్కుకు వచ్చేవారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

30వ వార్డులో..

జగదాంబ కూడలి: గ్రేటర్ 30వ వార్డు కుమ్మర వీధిలోని వీధిలైటు నెలరోజులుగా పగటి పూట వెలుగుతోంది. స్తంభం 43 ఏ బై 6 వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్ ఈ విధంగా పగలు వెలుగు పంచుతుండడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వాచ్‌హౌస్ నుంచి పూర్ణామార్కెట్ వరకు రాత్రి పూట వీధిలైట్లు వెలగని పరిస్థితి ఉంది. వార్డు కార్పొరేటర్ అప్పలరత్నం నిత్యం ఈ మార్గంలో తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ విద్యుత్ అధికారులు, సచివాలయం సిబ్బంది పరిస్థితి సరిదిద్దాలని కోరుతున్నారు.



30వ వార్డు కుమ్మరవీధిలో వెలుగుతున్న వీధిలైటు



మాధవధారలో వెలుగుతున్న లైట్లు

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించొద్దు



నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 30: విశాఖలో పోర్టు ఆస్పత్రి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) పద్ధతిన నిర్వహించాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని పోర్టు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి ప్రైవేటీకరణతో పోర్టు ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులకు, కుటుంబ సభ్యులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మసేన్, సీఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కనకారావు, ఇంటక్ అధ్యక్షుడు గొర్లె చందు, సిటూ ప్రధాన కార్యదర్శి పద్మనాభరాజు, హెచ్‌ఎంఎస్ నాయకుడు మంగయ్య నాయుడు, ట్రస్టుబోర్డు సభ్యుడు పోతన్న, వీరాంజనేయరావు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టి

» ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు



ట్రాక్ సూట్లు అందిస్తున్న విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, జూలై 30: కొండవాలు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ హామీ ఇచ్చారు. 48వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వార్డులో సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో వీధిదీపాల వెలగడంలేదని తెలిపారు. 48గంటల్లోగా అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే తెలిపారు. కొండవాలు గ్రామాల్లో పార్కింగ్‌కు అవకాశం లేక, వాహనాలను జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో నిలుపుతున్నట్లు తెలిపారు. ఈక్రమంలో ఆటోలు, ద్విచక్రవాహనాలు, వాటి విడి విభాగాలు చోరీకి లోనవుతున్నట్లు కార్పొరేటర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

బృందావన్ పార్కు అభివృద్ధి చేయండి

మురళీనగర్ ; మురళీనగర్ బృందావన్ పార్కుని మరింతగా ప్రజోపయోగంగా తీర్చిదిద్దాలని కోరుతూ పార్కు కమిటీ సభ్యులు, మురళీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకి వినతి పత్రం అందించారు. పార్కులో ఆడిటోరియం నిర్మాణం, లైట్లు, వాకింగ్ ట్రాక్, వ్యాయామ సామగ్రి ఏర్పాటు చేయాలని కోరారు. పార్కు కమిటీ కార్యదర్శి మురళీ, మురళీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ట్రాక్ సూట్లు పంపిణీ

అక్కయ్యపాలెం: పోర్టు స్టేడియంలోశిక్షణ పొందుతున్న అథ్లెటిక్ క్రీడాకారులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ట్రాక్ సూట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తరం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ 43వ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్,విశ్వనాథ కన్వెన్షన్ అధినేత బి.కాశీవిశ్వనాథ్, గొలగాని సౌజన్య పాల్గొన్నారు.

మర్రిపాలెం: అసెంబ్లీలో బీజేపీ ఫ్లోర్‌లీడర్‌గా నియమితులైన విష్ణుకు మార్‌రాజును 54వ వార్డు జనసేన అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.బోడసింగి శ్రీధర్, పాండ్రంకి దివాకర్ కడిమి సీతారాం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహనీయులు ఆత్రేయ, సినారె

» మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



సినీనిర్మాత కంచర్ల అచ్యుతరావును సన్మానిస్తున్న గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు

డాబాగార్డెన్స్, జూలై 30: తమ సాహిత్యం ద్వారా తెలుగు పాటకు జీవం పోసిన మహనీయులు ఆత్రేయ, సినారె అని మాజీ మంత్రి, భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత డా.సి. నారాయణరెడ్డి 94వ జయంత్యుత్సవం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఉపకార్ ట్రస్ట్ చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావును సినారె పురస్కారంతో సన్మానించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు నిర్వాహకుల కృషిని అభినందించారు. పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, సూరపనేని విజయ్‌కుమార్, గ్రంధి విష్ణు, ఉశిరికల చంద్రశేఖర్, చెన్నా తిరుమలరావు, శోభన్‌ప్రకాష్, ఎస్ఎస్ఎస్ఎన్ రాజు, ఉమామహేష్, లక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాయనీగాయకుల ఆలపించిన గీతాలు అలరించాయి.

జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారానికి కృషి

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు వినతిపత్రమిస్తున్న జర్నలిస్టులు

సీతంపేట, జూలై 30: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ కార్యవర్గం మంగళవారం పల్లా శ్రీనివాసరావుని కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను కార్యవర్గ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షులు జనార్దన్, అధ్యక్షులు బి.రవికాంత్, కార్యవర్గ సభ్యులు దవలేశ్వరపు రవికుమార్, కోశాధికారి అలపాటి శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రోత్సాహం: కలెక్టర్

మహారాణిపేట, జూలై 30: రైతు ఉత్పత్తిదారు సంఘాలకు తగిన ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎఫ్‌పీవోల జిల్లా మానటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లాలోని వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో చర్చించారు రాష్ట్ర, కేంద్ర పథకాలను రైతులకు చేరువయ్యేలా చూడాలన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెటింగ్ అవకాశాలు, స్టోరేజీ సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కలిగించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. పంటలకు గిట్టుబాటు వచ్చేలా ఉత్పత్తిదారుల సంఘా లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఫ్‌పీవోవిధానంతో దీర్ఘకాలిక ఆర్థిక ప్రయో జనాలు మార్కెటింగ్ అవకాశాల వివరించాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు బసంతకుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి



లోకేశ్‌కు వినతిప త్రమిస్తున్న వాసు

సీతంపేట, జూలై 30: విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి విభిన్న పత్రిభావంతుల కమిటీ అధ్యక్షుడు, 25వ వార్డు సీతంపేటకు చెందిన టీడీపీ నాయకుడు ఇసరపు వాసు తీసుకువచ్చారు. మంగళగిరిలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఈ మేరకు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు.

నగరంలో పది మంది ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు

మహారాణిపేట, జూలై 30: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పదిమంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఎస్‌ఐలను నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి. శ్యామలరావు విశాఖలోని మల్కాపురం లాండ్ అండ్ ఆర్డర్‌కు, పి.డి.వి. రవిశంకర్ ఆరిలోవ స్టేషన్‌కు బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పి.వి. రమణ మల్కాపురం క్రైమ్‌కు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన డి. సూరిబాబు పెందుర్తి క్రైమ్‌కు, ఎస్. సింహాచలం టూటౌన్ లా అండ్ ఆర్డర్ స్టేషన్‌కు, కె. నరసింగరావు నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ బదిలీ చేశారు. కోట మహంతి శ్రీనివాసరావు వన్‌టౌన్ స్టేషన్‌కు బదిలీ జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కె. దేముడు నాయుడు సీసీఎస్‌కు, పి.వి. రమణారెడ్డి దువ్వాడ క్రైమ్‌కు, కె. సత్యనారాయణను నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏయూలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలి

అక్కయ్యపాలెం, జూలై 30: ఆంధ్ర యూనివర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కోరారు. మంగళవారం ఏయూకి వచ్చిన ఆయనకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో ఇంజనీరింగ్ కళాశాలలో గ్రంథాలయ ఉద్యోగాలను నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. జేఎల్ఎల్ ఉద్యోగాలుభర్తీలు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ వయోపరిమితిని జనరల్ అభ్యర్థుల 47కు పెంచాలని చెప్పారు. న్యాయపరమైన సమస్యలను తొలగించి ఏయూతో పాటు అన్ని విశ్వ విద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఉద్యోగ భర్తీ చేపట్టాలని పేర్కొన్నారు.

రోడ్డుపై వ్యాపారాలకు నిరోధానికి చర్యలు

పూర్ణామార్కెట్, జూలై 30: పూర్ణామార్కెట్‌లో రోడ్డుమీద వ్యాపారాలను నిరోధించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తామని జోన్ 4 కమిషనర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆశీల కాంట్రాక్టర్ వాహనాల పార్కింగ్ సబ్ కాంట్రాక్టర్‌కు ఇవ్వ డంతో పరిసర రోడ్డుపై ఇష్టానుసారం జంగిళ్ల వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. వీటిరి నిరోధించాలని ఆదేశించినట్లు చెప్పారు. ట్రాఫిక్ పోలీసుల సహకారంతో రోడ్డుపై వ్యాపారాలకు అనుమతించేదిలేదన్నారు. ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు సోమవారం వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

రసవత్తరంగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

వీడి కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జనసేనకు మద్దతు ప్రకటించిన ఐదుగురికి అధికారికంగా పార్టీ కండువా కప్పలేదు. దీనికోసం రెండుసార్లు ముహూర్తాలు పెట్టుకున్నప్పటికీ పార్టీ అధిష్ఠానం నుంచి అభ్యంతరం వ్యక్తమవ్వడంతో చేరికలకు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీడీపీలో చేరేందుకు మరికొందరు వైసీపీ కార్పొరేటర్లు ఆసక్తిగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేలు, ఆయా వార్డుల్లోని నాయకులు, కార్యకర్తల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అయితే స్టాండింగ్ కమిటీకి వచ్చే నెల ఏడో తేదీన ఎన్నిక జరగబోతుండడంతో ఆలోగా చేరికలను పూర్తిచేయాలని టీడీపీ నేతలు తాపత్రయపడుతున్నారు. దీనికోసం ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసి తమ గోడు వినిపిస్తున్నారు.

ఇదిలావుండగా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో జనసేన కార్పొరేటర్లలో ఒక్కరికి కూడా అవకాశం కల్పించకపోవడంతో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కొందరు అసంతృప్తితో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే టీడీపీలో ఏళ్ల తరబడి ఉంటూ స్టాండింగ్ కమిటీలో పనిచేయాలని తహతహలాడిన కొందరు కార్పొరేటర్లకు అవకాశం దక్కకపోవడంతో వారిలో కొందరు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. వీరిలో ఎవరైనా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తారేమోననే ఆందోళన కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఉంది. ఒకవేళ అలాంటిదేమైనా జరిగినా ఇబ్బంది లేకుండా ఉండాలంటే కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వైసీపీ కార్పొరేటర్లలో కనీసం పది మందినైనా తీసుకోవాలని ఎమ్మెల్యేలను కోరుతున్నారు. అలా చేస్తే ఒకరిద్దరు క్రాస్ ఓటు వేసినా, అభ్యర్థుల గెలుపునకు ఢోకా ఉండదని వివరిస్తున్నట్టు సమాచారం. మరోవైపు వైసీపీ కార్పొరేటర్లలో కూడా చాలామంది పార్టీ నేతల వైఖరిపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. అధికారంలో ఉన్నంతకాలం కనీసం తమను పట్టించుకోలేదనే ఆగ్రహంతో ఉన్నారు. కొందరు టీడీపీ, జనసేనలో చేరిపోయేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ, ఆయా పార్టీల నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో వేచిచూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ పార్టీలో ఉన్నప్పటికీ వైసీపీ నుంచి పోటీ చేసేవారికి కాకుండా కూటమి మద్దతుతో పోటీచేస్తున్న వారికి ఓటు వేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వైరిపక్షంలో అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను గుర్తించి తాయిలాలు ఇచ్చి, తమ అభ్యర్థులకు ఓటు వేయించుకోవాలని ఇరువర్గాలు వ్యూహరచన చేస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో క్రాస్ ఓటింగ్ భయం ఇరువర్గాలను వెంటాడుతోందని చెప్పుకోవాలి.

వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఏయూ

... 5వ పేజీ తరువాయి

ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షు రాలు ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరిదేవి, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. అంతకుముందు ఏయూ మెరైన్ లివింగ్ రీసోర్సెస్ సెంటర్‌లో అవంతి స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను సౌరబ్ గౌర్ సందర్శించారు.

గత వీసీ హయాంలో అవకతవకలపై చర్యలు

అనంతరం మీడియాతో మాట్లాడిన సౌరబ్ గౌర్ గత వీసీ హయాంలో జరిగిన అవకతవకలు ప్రభుత్వం దృష్టికి వచ్చా యని, వీటిపై చర్యలు తీసుకుంటామన్నారు. విశ్వవిద్యా లయాల్లో అధ్యాపకుల నియామకాన్ని ప్రాధాన్యత అంశంగా పెట్టుకున్నట్టు వివరించారు. రెగ్యులర్ వైస్ చాన్సలర్ల నియా మకానికి ప్రణాళికలు తయారుచేస్తున్నట్టు వివ రించారు. ఏయూను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఏయూలో 58 విభాగాలు, పది సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గత వీసీ అక్రమాలు, అన్యా యాలపై పలువురు ఫిర్యాదులు చేశారు. ఉద్యోగులు ఇబ్బందులు, డిమాండ్లకు సంబంధించి వినతులను స్వీక రించారు.

ఫిర్యాదు చేసిన అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్

ఏయూ అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో సౌరబ్ గౌర్‌ను కలిసిన పలువురు పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. కృష్ణా యూనివర్సిటీ నుంచి, ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలని కోరారు. అనైతికంగా, అడ్డగోలుగా జగన్మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన బదిలీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు అధ్యాపకులు, స్కాలర్స్ సంతకాలతో ఫిర్యాదును చేశారు.

అర్హులందరికీ గృహాలు అందిస్తాం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



మాట్లాడుతున్న గండి బాబ్జీ

మహారాణిపేట, జూలై 30: కూటమి ప్రభుత్వం అర్హులందరికీ గృహాలు అందించనుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకుల పాలనలో 20 ఏళ్ల రాష్ట్రం వెనక్కి వెళ్లిపోయిందన్నారు.కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఖజానాలో ఒక్క రూపాయి లేకుండా చేశారని తెలిపారు. అయినా, హామీలు నిలుపుకోవడానికి ఉమ్మడి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఉద్యోగులకు పెన్షన్, జీతాలు ఇవ్వలేకపోయారన్నారు. అటువంటి పాలన వల్లే ప్రజలు వైసీపీని ఎన్నికల్లో బంగాళాఖాతంలో తోసేశారని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నిస్తోందన్నారు. జగనన్న ఇళ్లు పథకం అవినీతిమయంగా మారిందన్నారు. ఒక్కరికి ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవని, రూ. కోట్లలో డబ్బు దోచుకున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన డబ్బును తమదిగా ప్రచారం చేశారన్నారు. తాము ప్రతీ ఒక్కరికి ఇల్లు కేటాయిస్తామని, జర్నలిస్టులకు ఇళ్లు ఇచ్చేందుకు చంద్రబాబు సుముఖంగా ఉన్నారన్నారు. జగనన్న కాలనీలన్నీ చెరువులుగా మారాయన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేశారన్నారు. అనకాపల్లిలో 28 వేలు, విశాఖ నగర పరిధిలో 3 వేల ఉన్నాయన్నారు. చంద్రబాబు ఈ ఇళ్లను అందించి ప్రజల కల నెరవేర్చనున్నట్టు పేర్కొన్నారు. 100రోజుల్లో 1.25 లక్షల గృహాలు, ఏడాదిలో 8.25 లక్షల గృహాలు నిర్మాణం లక్ష్యం గా తీసుకున్నట్టు వివరించారు. గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పునఇస్తామన్నారు.ఈ సమావేశంలో గొంపా సత్యనారాయణ, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

రంగసాయి పురస్కారానికి తనికెళ్ల భరణి ఎంపిక

డాబాగార్డెన్స్, జూలై 30: రంగసాయి నాటక సంఘం 14వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆగస్టు 1న సినీ రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి రంగసాయి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్టు సంఘం వ్యవస్థాపకులు బాదంగీరి సాయి తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కళాభారతి ఆడిటోరియంలో సాయంత్రం 6గంటలకు ఈ కార్య క్రమం ప్రారంభమవుతుందన్నారు. రంగస్థలం కళాకారులకు రంగసాయి థియేటర్ అవార్డ్స్ కళాకారులు ఎస్.ఎం. బాషా, వి.సతీష్‌కుమార్, బి.వెంకట రామారావు, కె.మంగాదేవి, బి.రితీష్‌కు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో నిర్వాహకులు ఎన్ఎస్ఆర్, శివజ్యోతి, రవి బ్రహ్మ, నవరసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ ఆశీలు వేలం ఖరారు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

జగదాంబ కూడలి, జూలై 30: సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్) ఆశీల వేలం రూ. 52.50 లక్షలకు ఖరారైంది. మంగళవారం ఉదయం జీవీఎంసీ జోన్ 4 కార్యాలయంలో రెవెన్యూ అధికారులు ఈ వేలం నిర్వహించారు. ఇప్పటికే రెండుసార్లు నిర్వహించినా ఫోరం సరిపోక వేలం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఇద్దరు కాంట్రాక్టర్లు హాజరయ్యారు. జోన్ 4 రెవెన్యూ అధికారులు వేలం కొనసాగించారు. బి.శ్రీరామమూర్తి రూ. 52.50 లక్షలకు ఈ ఆశీల వేలం దక్కించుకున్నారు. ఎనిమిది నెలల కాల పరిమితికిగాను ఆశీల కాంట్రాక్టు కొనసాగుతుంది.

రామకృష్ణా రైతుబజారు ఆశీలు వేలం వాయిదా

వన్‌టౌన్ పరిధిలోని రామకృష్ణా రైతుబజారు ఆశీలు వసూలు వేలం మంగళవారం మరోసారి వాయిదా పడింది. కాంట్రాక్టర్లు హాజరుకాకపోవడంతో మరోసారి వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

నగర అభివృద్ధికి కృషి చేశా..

» జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ రవికృష్ణరాజు



రవికృష్ణరాజు

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా మూడేళ్లలో నగర అభివృద్ధికి తనవంతు కృషి చేసినట్టు పి. రవికృష్ణరాజు తెలిపారు. చీఫ్‌ఇంజనీర్‌గా బుధవారం ఉద్యోగ విరమణ చేస్తున్ననేపథ్యంలో తన హయాంలో చేపట్టిన అభివృద్ధిపనులను వివరించారు. దీర్ఘకాలంగా నిలిచిన అడవివరం, పాతగోశాల బీఆర్‌టీఎస్‌రోడ్డు, జగదాంబ జంక్షన్‌నుంచి పాతపోస్టాఫీస్ వరకూ రోడ్డు విస్తరణ, అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ, అనకాపల్లిలో పెరుగుబజార్‌రోడ్డు పూర్తి చేసినట్టు వివరించారు. కె.నగరంపాలెం రోడ్డు నిర్మాణం, 15 ప్రధాన కూడళ్ల అభివృద్ధి, వాటర్‌ఫౌంటెయిన్ల ఏర్పాటు, వీఎంఆర్‌డీఏ పార్కు, వన్‌టౌన్‌లో హెరిటేజ్ భవనాల అభివృద్ధి, ఎంవీపీ కాలనీలో స్పోర్ట్స్ ఏరీనాను పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చానన్నారు. కడపజిల్లా ప్రొద్దుటూరికి చెందిన తాను 1986లో పంచాయతీరాజ్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేరి వివిధ హోదాల్లో 37 ఏళ్లపాటు పనిచేశానన్నారు.

నామినేటెడ్ సందడి

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారని సమాచారం. అటు జనసేన, బీజేపీ నాయకులు కూడా ఎంతో కొంత తమకూ ప్రాధాన్యం ఉంటుందని భావిస్తున్నారు. జనసేనలో చాలామంది ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఏర్పాట్లు చేసుకున్నారు. పొత్తులో భాగంగా వారంతా కూటమి అభ్యర్థులకు సహకరించారు. జిల్లాలో ఆ విధంగా చూసుకుంటే కోన తాతారావు, పంచకర్ల సందీప్, పసుపులేటి ఉషాకిరణ్ వంటివారు ఉన్నారు. పార్టీకి పెద్ద దిక్కుగా బొలిశెట్టి సత్య శివశంకర్ వంటి వారు పనిచేశారు. బీజేపీలో కూడా పార్టీకి పనిచేస్తూనే కూటమి అభ్యర్థుల గెలుపునకు పనిచేసిన వారున్నారు. అందరినీ సమన్వయం చేసుకొని దామాషా పద్ధతిలో నామినేటెడ్ పోస్టులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

మసాజ్ కేంద్రాలపై పోలీసులు దాడులు

... 5వ పేజీ తరువాయి

ఆరుగురు మహిళలను పునరావాస కేంద్రానికి తరలించారు. మరో 21 మసాజ్ సెంటర్లకు ట్రేడ్ లైసెన్సులు, లేబర్ సర్టిఫికెట్‌లో పేర్కొన్నదానికంటే అదనంగా ఉద్యోగులు ఉండడం, జీఎస్‌టీ సర్టిఫికెట్ లేకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించి నోటీసులు జారీచేశారు.వీటిపైచర్యలకు సంబంధిత శాఖలకు సమాచారం అందించారు. నిబంధనలు పాటించని స్పాలు, మసాజ్ సెంటర్ల గురించి ఎవరికైనా తెలిస్తే సీపీ హెల్ప్‌లైన్ నంబర్ 7995095799కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

టీడీఆర్ కుంభకోణంపై దర్యాప్తు జరిపించండి

» జీవీఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే వెలగపూడి వినతి



కమిషనర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, జూలై 30: జీవీఎంసీ పరిధిలో జరిగిన టీడీఆర్ కుంభకోణాలపై దర్యాప్తు చేయాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. మంగళవారం కమిషనర్‌ను కలిసి పలు విషయాలు చర్చించారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో ఐదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులూ జరగలేదన్నారు. పెదజాలారిపేట, బిలాల్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో టీడీఆర్ పేరిట కుంభకోణం జరిగిందని, ఈవిషయాన్ని అసెంబ్లీలో కూడా ప్రస్తావించానన్నారు. పలు నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతిలిచ్చిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులపై దర్యాప్తు చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, కాలువలను ఆధునికీకరించాలని, పార్కుల నిర్వహణ కొరవడిందని, కొండవాలు ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

దోమల నియంత్రణకు సహకరించాలి



విద్యార్థులతో కలిసి అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం దుర్గాకుమారి

పెదవాల్తేరు, జూలై 30: దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నౌకానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దుర్గా కుమారి అన్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి రత్నం ఆధ్వర్యంలో దోమల నివారణపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణకు సహకరించాలని కోరారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, బోద, మెదడువాపు వ్యాధులను అరికట్టాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉమా గాంధీ గ్రీన్ క్లైమేట్ టీం వలంటీర్ రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

సిరిపురం, జూలై 30: షెడ్యూల్డ్ కార్మికులకు కనీస వేతనాల బోర్డు ఏర్పాటుచేసి, జీతాలు పెంచాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మున్సిపల్ వర్కర్స్ సీఐటీయూ యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం హోటల్ మేఘాలయలో మంత్రిని కలిసి మెమోరాండం అందజేశారు. మునిసిపాలిటీల నుంచి జీఎస్టీ రూపంలో సంవత్సరానికి రూ.30 కోట్లు జమవుతోందని, కార్మికులకు ఎంటీఎస్ వేతనాలకు రూ.33 కోట్లు అవుతుందని, దీంతో మునిసిపాలిటీలపై భారం ఉండదన్నారు.

రక్తదానంతో ప్రాణదానం: ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, జూలై 30: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. చినగదలి సాయిబాబా గుడి జంక్షన్‌లో మంగళవారం ఈగల ప్రభాకర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పినాకిల్ ఆస్పత్రి, రోటరీ బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో సుమారు 60 మంది రక్తదానం చేశారు. ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, ఎల్.వాసు, ఈగల శ్రీనివాస్, కొణతాల శ్రీనివాస్, అజయ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి పాలన'



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

ఎండాడ, జూలై 30: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆరోపించారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తిగత కక్షలతో దాడులు పెరిగాయన్నారు. కూటమి నేతలు అధికారంలోకి రావడానికి అనేక తప్పుడు హామీలు ఇచ్చారన్నారు. తక్కువ సీట్లు వచ్చాయని వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా ఉండటం సరైన నిర్ణయం కాదన్నారు.

ఘనంగా గురునాథ్ పుట్టినరోజు వేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న గరే గురునాథ్, టీడీపీ నాయకులు

కొమ్మాది, జూలై 30: టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు గరె గురునాథ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పి.ఎం. పాలెం ఆర్.హెచ్. కాలనీలో ఆరో వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డిసత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి 150 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గురునాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ముస్లింకాలనీ, గాయత్రినగర్ తదితర ప్రాంతాల్లో మహిళలకు చీరలు, విద్యార్థులకు పుస్తకాలు, యువకులకు క్రీడా సామగ్రి అందించారు. తన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన నాయకులకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు కాదు... రహదారే!



పీఎంపాలెం రామాలయం వీధిలో ఇలా...

కొమ్మాది, జూలై 30: పీఎంపాలెం రామాలయం వెనుక ఎంబీజీ కాలనీ రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. కొద్దిపాటి వర్షం కురిసినా రహదారి చెరువును తలపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. ఈ నీళ్లలో పందులు దొర్లుతుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. రాకపోకలకూ తీవ్ర అంతరాయం కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

దారి ఇలా... రాకపోకలు ఎలా?

» బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్మాణంతో సింహాచలం వాసుల అవస్థలు



:కాంప్లెక్స్ ముఖద్వారం వద్ద నిర్మాణ పనులు



రహదారిపై వేచి ఉన్న ప్రయాణికులు

సింహాచలం, జూలై 30: గ్రేటర్ 98వ వార్డు పాతగోశాల కూడలి నుంచి పాతఅడివివరం కూడలి వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ సింహాచల కారిడార్ నిర్మాణం అడివివరం వాసులతో పాటు సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఇప్పటివరకు అడివివరం గ్రామాన్ని కలిపే లింక్‌రోడ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో వీధుల్లోకి రాకపోకలు నిలిచిపోయాయి. తాజాగా అప్పన్న దర్శనానికి సింహాచలం కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తున్న బస్సు ప్రయాణికులకు కష్టాలు ఎదురవుతున్నాయి. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ముఖద్వారం వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమై రెండువారాలు గడుస్తున్నా పురోగతి కనిపించడం లేదు. ఈ స్థితిలో కాంప్లెక్స్‌లోకి బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో నడిరోడ్డుపై ప్రయాణికులు పడిగాపులు పడాల్సి వస్తోంది. కాంప్లెక్స్‌లోకి బస్సులు వెళ్లే అవకాశం లేక, బస్సులు ఎక్కడ నిలుపు చేస్తారో తెలియక ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదం సంభవిస్తుందోననే భయాందోళన నెలకొంటోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ దాటి వెనుకభాగాన ఉన్న పద్మావతి అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు సరైన దారి లేక యాతన పడుతున్నారు. తక్షణం కాంప్లెక్స్ ఎదుట పనులు పూర్తి చేసి బస్సులు, భక్తులు రాకపోకలకు వీలు కల్పించాలని కోరుతున్నారు.

ఖండాంతరాలు దాటిన అభిమానం

» పూర్వ విద్యార్థిని చూసేందుకు అమెరికా నుంచి వచ్చిన అధ్యాపకురాలు



మారిన్‌లైమ్ లాన్సెన్‌కు స్వాగతం పలుకుతున్న రూపవతి, ఇవాంజలిన్

కొమ్మాది, జూలై 30: కొమ్మాది రిక్షా కాలనీలోని గురుకుల ప్రతిభా కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువున్న కుమారి రోండా ఇవాంజలిన్.. కెనడీ లూజర్ యూత్ ఎక్స్ఛేంజీ ప్రోగ్రాంలో ఎంపికై అమెరికాలో ఏడాదిపాటు అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సు పూర్తిచేసుకుని స్వదేశానికి వచ్చారు. స్థానిక గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అమెరికాలో చదువుతున్న సమయంలో ఆమెకు గైడ్‌గా పనిచేసిన అధ్యాపకురాలు మార్లిన్ లైమ్ లాన్సెన్ ఆ విద్యార్థినిని చూడాలన్న ఆకాంక్షతో మంగళవారం కొమ్మాది గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. ఆమెకు ఉమ్మడి జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త రూపవతి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. అమెరికాలోని విద్యావ్యవస్థ, అక్కడి సంప్రదాయాలు, సంస్కృతి వివరించారు. ఇక్కడి విద్యాబోధన, సంప్రదాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిన్సిపాల్ నవనీత వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదజాలారిపేటలో జీవీఎంసీ కమిషనర్ పర్యటన



19వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ సంపత్ కుమార్

పెదవాల్తేరు, జూలై 30: పెదజాలారిపేట, ఎంఎస్ఎఫ్-3 తదితర ప్రాంతాలలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, కార్పొరేటర్ నొల్లి నూకరత్నం మంగళవారం పర్యటించారు. పెదజాలారిపేటలో వీధులు, బస్ డిపో, శ్మశానవాటికలను సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పెదజాలారిపేటలో కాలువలు, బీచ్‌లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయన్నారు. పబ్లిక్, కమ్యూనిటీ టాయిలెట్లులో మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్‌ను కోరారు. అనంతరం కమిషనర్ ఆయా ప్రాంతాల్లో కాలువలను, బీచ్‌ను పరిశీలించారు. పెదజాలారిపేట నుండి బీచ్‌లో ప్రవేశానికి ప్రధాన గేటును ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పబ్లిక్/కమ్యూనిటీ టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బస్‌డిపో ఆవరణలో ఉపయోగంలో లేని విద్యుత్ స్తంభాలను తరలించాలని డీఈఈ శ్రీనివాసరాజుకు ఆదేశించారు. బీచ్ క్లినింగ్ మిషన్ పనితీరును గమనించి ఇసుకలో వ్యర్థాలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సహాయ వైద్యాధికారి ప్రసాద్‌రావును ఆదేశించారు. అనంతరం ఎంఎస్ఎఫ్-3 కంపోస్టు యూనిట్ పనిచేసేలా చూడాలన్నారు. పర్యటనలో కార్యనిర్వాహక ఇంజనీర్ రమణమూర్తి, ఏసీపీ వెంకటేశ్వరరావు, టీపీవో ప్రమీల, ఏపీడీ దుర్గాప్రసాద్, జోనల్ కమిషనర్ జె.విజయలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భూలోకమాత ఉత్సవాలు





అమ్మవారికి అభిషేకం చేస్తున్న దృశ్యం, నీటి బిందెలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న మహిళలు

వెంకోజిపాలెం, జూలై 30: కొత్త వెంకోజీపాలెం భూలోకమాత అమ్మవారి మారువారం పండుగ మంగళవారం వేడుకగా జరిగింది. ఉదయం 5 గంటలకు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, జోశ్యుల దంపతులు, కార్యవర్గ సభ్యులు తొలి పూజ చేశారు. గ్రామ పెద్దలు అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. మహిళలంతా బిందెలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బి.రామచంద్రరావు, పిళ్లా ప్రతాప్‌రెడ్డి, మద్దాల వీరవెంకట అప్పారావు, మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, ఆడారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మూడుగుళ్ల అమ్మవారి ఉత్సవాలు

ఆరిలోవ: హనుమంతవాక జంక్షన్ పాతడైరీఫారం వద్ద కొలువైన భూలోకమాత, కనకదుర్గ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అనుపోత్సవాన్ని ఆలయ ధర్మకర్త నొగల రాంబాబు ఆధ్వర్యంలో జరిపారు. పరస ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయి. వచ్చేనెల ఆరో తేదీన మారువారం సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

కృష్ణాపురం కాలువలోకి సాగునీరు విడుదల



కృష్ణాపురం గ్రోయిన్ నుంచి సాగునీరు విడుదల చేస్తున్న దృశ్యం

పద్మనాభం, జూలై 30: మండలంలోని పొట్నూరు గ్రామం వద్ద గోస్తనీ నదిపై కృష్ణాపురం గ్రోయిన్‌కు అనుబంధంగా ఉన్న కాలువలోకి మంగళవారం గ్రామ నాయకులు సాగునీటిని విడుదల చేశారు. ముందుగా స్థానిక టీడీపీ నాయకుడు మొకర అప్పనాయుడు (అన్నమయ్య) గ్రోయిన్ గేటు వద్ద పూజలు చేసి నీటిని వదిలారు. ప్రస్తుత ఖరీఫ్‌తోపాటు రబీకాలంలో సుమారు 1200 ఎకరాలకు ఈ కాలువ ద్వారా వచ్చేనీటిని వినియోగిస్తారు. పొట్నూరు, అర్జునపాలెం, ఇసకలపాలెం, పద్మనాభం, కృష్ణాపురం మీదుగా సుమారు 8 కిలోమీటర్ల మేరకు కాలువ ప్రవహించి ఆయా గ్రామాల్లోని పొలాలకు నీరందిస్తూ, మిగులు జలాలు కృష్ణాపురం ఎర్రచెరువులో కలుస్తాయి. ఈ నీటి విడుదలతో వరినాట్లకు వీలవుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, మాజీ ఎంపీపీ గోపీబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, మాజీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీను, నాయకులు నందీశ్, ఎర్నాయుడు, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రైఫ్రూట్స్ పంపిణీ

భీమునిపట్నం, జూలై 30: పట్టణంలోని జీవీఎంసీ హైస్కూల్‌లో శిక్ష సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు రుచికరమైన భోజనంతోపాటు అరేబియన్ డేట్స్, డ్రైఫ్రూట్స్‌ను అందజేసినట్టు హెచ్‌ఎం చెట్టి సింహాచలం తెలిపారు. దాతలు రామన్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ ఎస్ఆర్‌సీ చైర్మన్ చెట్టి అశోక్ చక్రవర్తి, ఉపాధ్యాయుడు గుర్రాల పండరీనాథ్ వీటిని అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నయీమ్, అల్లాడ శ్రీనివాసరావు, ఇమంది వెంకటరావు, రామకృష్ణ, వైవీ రవికుమార్, వంశీ, సునీత పాల్గొన్నారు.

మంగమారిపేటలో అక్రమ నిర్మాణాలు



మంగమారిపేటలో అక్రమ భవన నిర్మాణం

భీమునిపట్నం, జూలై 30: మండలంలోని మంగమారిపేటలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత సూరాడ నరసింగరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్టు చెప్పారు. కాపులుప్పాడ రెవెన్యూ సర్వే నంబరు 314లో సుమారు 30 సెంట్లలో నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు అక్రమంగా నిర్మాణాలకు అవకాశమిచ్చినట్టు ఆరోపించారు. దీంతో పది మంది ఇళ్ల నిర్మాణపనులు చేపట్టారన్నారు. మంగమారిపేట, తొట్లకొండ ఏటవాలు ప్రదేశంలో గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారంపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

నిజాయితీగా పనిచేస్తేనే గుర్తింపు



బదిలీపై వెళ్తున్న ఆర్ఎస్‌ఐలను సత్కరిస్తున్న కమాండెంట్

కొమ్మాది, జూలై 30: నిజాయితీతో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్ పద్మనాభ రాజు అన్నారు. బదిలీపై వెళ్తున్న నలుగురు ఆర్ఎస్‌ఐలను మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఇళయసాగర్, నారాయణ, పి.సత్యం, ఆర్ఐలు, ఆర్ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఒడిశా దాసుడి ఆధ్వర్యంలో ఘనంగా నృసింహ హోమం



హోమంలో పాల్గొన్న దాసుడు, పండితులు

సింహాచలం, జూలై 30: వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తుడు, ఒడిశాలోని పట్నుపురం గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ నాయకోదాసుడు మంగళవారం సుదర్శన నారసింహ హోమాన్ని జరిపించారు. పురోహితులు కరి సీతారామాచార్యులు సారథ్యంలో దాసుడి గోత్రనామాలతో సంకల్పించి కలశారాధన, మండపారాధనలు చేసి హోమకుండంలో అగ్నిప్రతిష్ఠాపనం కావించారు. పంచసూక్తాలు, నృసింహ, సుదర్శన మూలమంత్ర పఠనాలతో హవనాన్ని చేసి మహాపూర్ణాహుతి చేశారు. అనంతరం దాసుడి దంపతులు వైష్ణవ స్వాములకు తదీయారాధన(భోజనాలు) ఏర్పాటు చేశారు. హోమంలో ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి దంపతులు, సిబ్బంది, ఒడిశా భక్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత నిత్యకల్యాణం

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు, షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణలు చేసిన తరువాత కల్యాణోత్సవం జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేడు తాగునీటికి అంతరాయం

వెంకోజీపాలెం, జూలై 30: జీవీఎంసీ రెండో జోన్ పరిధి 6,7,8 వార్డుల్లో బుధవారం తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు కేవీఎన్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. బోని వద్ద ఉన్న హెడ్ వాటర్‌వర్క్స్ 700 ఎంఎం డీఐ పైపులైను లీకులు ఏర్పడినందున మరమ్మతులు చేసేందుకు వీలుగా సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆరో వార్డు ఆర్.హెచ్.కాలనీ, అశోక్‌నగర్, తులసినగర్, పీఎంపాలెం హౌసింగ్ కాలనీ, బక్కన్నపాలెం, రేవల్లపాలెం, రిక్షాకాలనీ, వైభవ్ నగర్, ప్రశాంతినగర్, వల్లినగర్, ఏడో వార్డు మిథిలాపురి ఉడా కాలనీ, ఓల్డ్ మధురవాడ, ఎన్‌జీవోస్ కాలనీ, దుర్గానగర్-1, 2, 8వ వార్డు పరిధిలో షిప్‌యార్డు లేఔట్, స్టేడియం ఎదురుగా ఉన్న ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదని, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూలై 30: ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సంతపాలెం, తోటగరువు, గాంధీనగర్, బాలాజీ నగర్, శ్రీహరినగర్, రవీంద్రనగర్, ముస్తాఫాకాలనీ, అన్నానగర్, కైలాసనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

భీమునిపట్నం, జూలై 30: మండలంలో సామాజిక పింఛన్లను ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 6 గంటలనుంచి లబ్ధిదారులకు పంపిణీ ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో వి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 6,161 మంది పింఛనుదారులకు మొత్తం రూ.2,55,21,500 నగదు అందజేస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తొలిరోజే 99 శాతం వరకూ పంపిణీ పూర్తిచేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈనెలలోనే పింఛనుదారులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

వెలగని వీధి దీపాలతో ఇక్కట్లు

కొమ్మాది, జూలై 30: రాత్రి సమయంలో పీఎం పాలెం ప్రధాన రహదారిలో కారు చీకట్లు కమ్ముకుంటున్నాయి. కార్‌షెడ్ కూడలి నుంచి అనేకచోట్ల వీధిదీపాలు వెలగక పోవడంతో స్థానికులు బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళల్లో కుక్కలు వెంటపడుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

యోగా పోటీలకు భీమిలి క్రీడాకారులు

భీమునిపట్నం, జూలై 30: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు భీమిలి క్రీడాకారులు ఎ.కోమల్‌కుమార్, కె.వెంకటేష్ ఎంపికయ్యారు.విజేతలు సెప్టెంబరులో జరగనున రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని కోచ్, నేషనల్ రిఫరీ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. వారిని ఎంఈవో-1 ఎం.శివరాణి అభినందించారు.

అనాథ పిల్లలకు వితరణ

భీమునిపట్నం (రూరల్), జూలై 30: మండలంలోని లక్ష్మీపురంలో కె.సంజీవరావు తనసొంత నిధులతో సమకూర్చిన యూనిఫాం, బ్యాగులు ఇతర విద్యా సామగ్రిని జెడ్పీటీసీ సభ్యుడు జి.వెంకటప్పడు మంగళవారం పిల్లకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థికసాయం అందించారు. సర్పంచి జీవీ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 28, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 28, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 38, అరటికాయ పెద్దది 6, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 150, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 78, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు (బ్యాగ్)		
రైతు ధర	--	82
ఫారం ధర	--	102
విత్ స్కిన్	--	174
స్కిన్‌లెస్	--	184

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..